క్లుప్తంగా

నేడు ఇస్కాన్ స్వామీజీ అరెస్ట్‌కు నిరసనగా ర్యాలీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను, ఇస్కాన్ స్వామీజీ అక్రమ అరెస్టును నిరసిస్తూ బుధవారం ఏలూరులో నిరసన ర్యాలీ చేపట్టామని హిందూ జాగృత సమితి ఒక ప్రకటనలో తెలిపింది. బంగ్లాదేశ్‌లో హింసకు గురవుతున్న హిందువులకు సంఘీభావంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని, జిల్లాలోని వ్యాపారస్తులు, హిందువులు, యువకులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరింది.

బాలికల సమస్యల పరిష్కారానికి కృషి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

దెందులూరు: బాలికల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులకు కిశోర వికాసంపై శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కిశోర్ బాలికలకు 9 రకాల సేవలను అందిస్తామన్నారు. వెలుగు ఏపీఎం సురేష్ మాట్లాడుతూ వెలుగు శాఖ జెండర్ ఆధారిత హింస బాలల విద్య, గృహహింస, ఇతర అంశాలపై పనిచేస్తుందన్నారు. దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికల సంపూర్ణ ఆరోగ్యం, అభివృద్ధి లక్ష్యంగా పోషకహారాలను అందిస్తోందన్నారు. ఉపాధ్యాయురాలు జీ జ్యోతి ఆయన శాఖలకు సంబంధించి వివరాలు తెలిపారు.

ఏపీఆర్‌ఈయూ జిల్లా అధ్యక్షుడిగా సోడిశెట్టి

ద్వారకాతిరుమల: ఆంధ్రప్రదేశ్ రిపోర్టర్స్ అండ్ ఎడిటర్స్ యూనియన్ (ఏపీఈఆర్‌యూ) ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ఒక అతిథి గృహంలో రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరపు సాంబశివ నాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఈఆర్‌యూ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సోడిశెట్టి శాంతకుమార్‌కు సాంబశివరావు నియామక పత్రాన్ని అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుచ్చిబాబు, యూనియన్ ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి రాధాకృష్ణ, జిల్లా నూతన అధ్యక్షుడు శాంతకుమార్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

టి.నరసాపురం: మండలంలోని రాజుపోతేపల్లి గ్రామంలో ఇంటి స్థలం వివాదం నేపథ్యంలో కత్తితో దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎం జయబాబు తెలిపారు. రాజుపోతేపల్లికి చెందిన నత్త నాగరాజు, గుమ్మళ్ల స్వామికి ఇంటి స్థలం వివాదం కొన్నాళ్లుగా నడుస్తోందన్నారు. ఈ క్రమంలో ఈనెల 2న నాగరాజు స్థానిక సచివాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా, స్వామి కత్తితో దాడి చేశాడని తెలిపారు. గాయపడిన నాగరాజు చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. నాగరాజు భార్య సుజనమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్ట్

కొయ్యలగూడెం: గవరవరంలో సోమవారం రాత్రి జూద శిబిరాలపై దాడులు చేశామని ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.1.23 లక్షలు, 5 కోడి పుంజులు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ మేకు కేసు నమోదు చేశామని ఎస్సై మంగళవారం తెలిపారు.

ఎక్సైజ్ దాడులు

చింతలపూడి : అల్లిపల్లి గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఒక మహిళను అరెస్ట్ చేసి, 20 మద్యం బాటిళ్లను స్వాధీన చేసుకున్నట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. మహిళను స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరచి బైండ్ ఓవర్ చేశామన్నారు. చింతలపూడి ఎక్సైజ్ ఎస్సై అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

గోకులం షెడ్ల మంజూరులో పచ్చపాతం

- టీడీపీ సానుభూతిపరులకే ప్రాధాన్యత
- పేద పాడి రైతులకు మొండిచెయ్యి



మాదేపల్లిలో షెడ్డు ఉన్నప్పటికీ కొత్త షెడ్డు కడుతున్న లబ్ధిదారుడు



మాదేపల్లిలో లబ్ధిదారుడి షెడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఇంజినీర్లు

ఏలూరు రూరల్ : సంక్షేమ పథకాల మంజూరులో టీడీపీ సానుభూతి పరులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. దీంతో అర్హులకు మొండిచెయ్యి చూపుతున్నారు. ఇందుకు కొద్ది వారాల క్రితం ప్రారంభమైన గోకులం షెడ్ల పథకమే సాక్ష్యం. గతంలో టీడీపీ హయాంలో ఈ పథకం వల్ల ఆ పార్టీ శ్రేణులకే లబ్ధి చేకూరింది. కొందరైతే షెడ్డు నిర్మించకుండానే నిధులు కాజేశారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసింది. తాజా మళ్లీ కూటమి ప్రభుత్వం గోకులం షెడ్ల పథకాన్ని అమలు చేస్తోంది.

10 శాతం చెల్లిస్తే చాలు

గోకులం పథకంలో రాష్ట్ర ప్రభుత్వం ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు పెంచుతున్న రైతులు షెడ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం చేస్తోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చిస్తోంది. షెడ్డు నిర్మాణంలో లబ్ధిదారుడు కేవలం 10 శాతం నగదు ఖర్చు చేస్తే చాలు. అంటే రూ.లక్షకు రూ.10 వేలు లబ్ధిదారుడు భరిస్తే.. మిగిలిన రూ.90 వేలు ప్రభుత్వం అందిస్తుంది. ఈ పథకం గురించి స్థానిక ప్రజాప్రతినిధి అనుచరుల ద్వారా గ్రామాల్లో టీడీపీ సానుభూతిపరులకు సమాచారం అందింది. వెంటనే వారు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు కూడా వారికే షెడ్లు మంజూరు చేస్తున్నారు. అప్పటికే సొంతంగా షెడ్డు కట్టుకున్నవారికీ మరో షెడ్డు మంజూరు చేశారు. దీంతో అప్పోసప్పో చేసుకుని షెడ్డు నిర్మించుకుంటే వర్షాకాలం, ఎండాకాలంలో పశువులు నీడ పట్టున ఉంటాయనుకున్న పేద రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రభుత్వం జిల్లాకు 900 యూనిట్లు మంజూరు చేయగా, పశుసంవర్ధకశాఖ అధికారులు ఏలూరు రూరల్ మండలానికి 10 యూనిట్లు చొప్పున కేటాయించారు.

యూనిట్ల విభజన ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల సంఖ్యను లెక్కగట్టి పలు యూనిట్లుగా విభజించారు. రెండు గేదెలు లేదా ఆవులు ఉన్నవారికి రూ.1.15 లక్షలు, నాలుగు ఉన్న వారికి రూ.1.85 లక్షలు, ఆరు ఉన్నవారికి రూ.2.30 లక్షలు అందించనున్నారు. 10 శాతం లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది. 20 జీవాలు ఉన్న గొర్రెలు, మేకల పెంపకదార్లకు రూ.1.30 లక్షలు, 50 జీవాలు ఉన్నవారికి రూ.2.30 లక్షలు, 100 కోళ్లు ఉన్న వారికి రూ.87 వేలు, 200 ఉన్న వారికి రూ.1.32 లక్షలు అందిస్తారు. మొదట లబ్ధిదారులను పశు సంవర్ధకశాఖ అధికారులు నిర్ధారిస్తారు. తర్వాత ఉపాధి హామీ పథకం అధికారులు వారికి జాబ్‌కార్డులు మంజూరు చేస్తారు. రుణం మంజూరు కాగానే లబ్ధిదారులు షెడ్డు నిర్మాణం చేపట్టాలి. వీటిని ఉపాధి హామీ అధికారులు పర్యవేక్షిస్తారు.

ఐదు గ్రామాలకు కేటాయింపు

ఏలూరు రూరల్ మండలానికి 10 యూనిట్లు మంజూరయ్యాయి. మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి, చాటపర్రు, మల్కాపురం. ఈ ఐదు గ్రామాలకు యూనిట్లు కేటాయించాం. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు షెడ్డు కట్టుకునేందుకు స్థలం ఉందా లేదా పరిశీలించాం. పశువు పోషకలను గుర్తించి తర్వాతే యూనిట్ మంజూరు చేశాం. షెడ్డు పనులు, బిల్లులు చెల్లింపు ప్రక్రియ అంతా ఎంఎన్‌ఆర్ ఈజీఎస్ అధికారులు పరివేక్షిస్తారు.

– ఎం లక్ష్మి, పశు వైద్యురాలు, చాటపర్రు

పంట పొలాల్లో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: మతిస్థిమితం లేని వ్యక్తి పంట పొలాల్లో పడి మృతి చెందాడని ఏలూరు రూరల్ పోలీసులు తెలిపారు. పెదపాడు మండలం సకలకొత్తపల్లి ప్రాంతానికి చెందిన ఆబోతుల సూరిబాబు (40) కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేదన్నారు. దీంతో సూరిబాబును ఏడాది క్రితం భార్య, పిల్లలు వదిలి స్వగ్రామానికి వెళ్లిపోయారు. నాటి నుంచి ఒంటరిగా ఉన్న సూరిబాబు ఆలనా పాలన తన అక్క చూస్తోందని, సోమవారం అక్కతో కలిసి ఆసుపత్రికి వెళ్లి తిరిగి వచ్చిన అతను కనపడకుండా పోయాడని తెలిపారు. మంగళవారం కోడేలు 1వ డివిజన్ పంచాయతీ సమీపంలో సూరిబాబు వరి పొలంలో మృతి చెందాడన్నాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై దుర్గ ప్రసాద్ ఘటనా స్థలిలో మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

నేడు ఘంటసాల సంగీత గానామృత లహరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో ఘంటసాల 102వ జయంతి సందర్భంగా ఘంటసాల గానామృత లహరి కార్యక్రమం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు వి.రామ్ కుమార్, ఎండీ ఖాజావలి ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు గాయకులు ఘంటసాల గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు.

అశ్లీల సాహిత్యం, వెబ్‌సైట్లను అరికట్టాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



సదస్సులో పాల్గొన్న పోలీస్ అధికారులు, మహిళా నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్త్రీల పట్ల పురుషులు వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి మెడికల్ ఫార్మసీ కాలేజ్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు, విద్యార్థినులపై జరుగుతోన్న దాడులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులపై లైంగికదాడులను, అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అవేర్నెస్ ప్రోగ్రాంకు ఐక్యరాజ్యసమితి ఇచ్చిన పిలుపు మేరకు తొలుత సీఆర్ రెడ్డి మెడికల్ ఫార్మసీ కళాశాల నుంచి స్థానిక కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులపై అత్యాచారాలను అరికట్టాలని, మద్యం, డ్రగ్స్ అరికట్టాలని డిమాండ్ చేసారు. అనంతరం నిర్వహించిన సదస్సులో రమాదేవి మాట్లాడుతూ అశ్లీల సాహిత్యం వెబ్‌సైట్‌లు అరికట్టడం అవసరమన్నారు. అత్యాచారాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ఎస్సై కాంతి ప్రియ మాట్లాడుతూ కళాశాలలో, విద్యాలయాల వద్ద విద్యార్థినులపై వేధింపులు అరికట్టడానికి పోలీసులను అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. అభయ బ్లూ కార్ప్ 112 నెంబర్లకు ఫోన్ చేయడం ద్వారా విద్యార్థులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎం రాజా రామ్మోహన రావు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ గ్రీవెన్స్ అండ్ రిడ్రెస్సెల్ సెల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కేహెచ్ మౌనిక, డాక్టర్ పి.ఉషారాణి, ఇ.జాజిలి, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, శ్యామల రాణి, ఐద్వా నాయకులు శారద, ఎం అరుణ తదితరులు పాల్గొని మాట్లాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



విద్యార్థినులతో మాట్లాడిస్తున్న ఎస్సై మధు వెంకట రాజా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థి దశలోనే అవగాహన కలిగి ఉండడం ద్వారా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండే అవకాశముందని సైబర్ పోలీస్ స్టేషన్ ఎస్సై మధు వెంకట రాజా అన్నారు. ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు అమీనా పేటలోని శ్రీ సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైమ్, సోషల్ మీడియా అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. సైబర్ ఎస్సై మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేడు ఏం జరిగినా అరక్షణంలో ప్రతి ఒక్కరికీ తెలుసుకొనే అవకాశం ఏర్పడిందని, అటువంటి పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ నేరగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని వివరించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేసి తెలిపితే పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. విజ్ఞానానికి ఉపయోగించే సోషల్ మీడియాని దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలని తెలిపారు.

చర్చిల్లో క్రిస్మస్ ఏర్పాట్లు



విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చి



అమ్మకానికి సిద్ధంగా ఉన్న క్రిస్మస్ స్టార్లు



విద్యుత్ దీపాలతో ముస్తాబైన భీమడోలు ఆర్‌సీఎం చర్చి

దెందులూరు: క్రిస్మస్ పండుగ ఏర్పాట్లు గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. సాల్వేషన్ ఆర్మీ ఆర్‌సీఎం, సీఎస్ఐ, సెవెంత్ డే, మన పెంతుకోస్తు, ఐసీఎం చర్చిలతో పాటు ఇతర స్వతంత్ర సంఘాల చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. చర్చిలకు రంగులు వేసి, విద్యుత్ బల్బులు ఏర్పాటు చేస్తున్నారు. చర్చిల వద్ద స్టార్లు ఏర్పాటు చేశారు. క్రిబ్బులు, క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేసే పనుల్లో చర్చిల నిర్వాహకులు, యూత్ సభ్యులు నిమగ్నమయ్యారు. మరో పక్కన అన్ని షాపుల్లో క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ క్యాండిల్స్ ,క్రిస్మస్ డెకరేషన్ పేపర్లు నూతన డిజైన్లతో ముమ్మరంగా అమ్మకాలు సాగుతున్నాయి. అన్ని చర్చిల నిర్వాహకులు, యూత్ సభ్యులు గ్రామాల్లో రాత్రి వేళ క్యారల్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సెమీ క్రిస్మస్ వేడుకలను చర్చిల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు.

విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చిలు

భీమడోలు: క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపేలా ప్రతి గ్రామంలో యువత ప్రార్థనాలయాల్లో విద్యుత్ దీపాలతో భారీ స్టార్స్‌ను ఏర్పాటు చేసి ఔరా అనిపించారు. ఉదయకాల ఆరాధన ప్రార్థన కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొని ఏసు క్రీస్తును ఆరాధిస్తూ నెల రోజుల ముందుగా క్రిస్మస్ ఆనందాన్ని పొందుతున్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో ఆర్‌సీఎం, సీఎస్ఐ, రక్షణ సైన్యం, పెంతెకోస్తు, చర్చిల్లో క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభం కాగా ప్రతి చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేసారు. భీమడోలు ఆర్‌సీఎం జీసస్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్‌సీఎం చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించి, 25 అడుగుల భారీ స్టార్‌ను ఏర్పాటు చేసారు. విచారణ కర్త ఫాదర్ షింటో, ఫాదర్లు నెల్సన్, జింటో, జిజో, డీపాల్ విన్సెంట్ సొసైటీ సభ్యులు, పెద్దలు, జీసస్ యూత్, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొని ప్రార్థనలు చేస్తున్నారు.

13 నుంచి సీపీఎం సభలు

బుట్టాయగూడెం: ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు బుట్టాయగూడెంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. మహాసభల పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మూడేళ్లకోసారి జరిగే జిల్లా మహాసభలు మొదటిసారిగా పోరాటాలకు కేంద్రమైన బుట్టాయగూడెంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. 13వ తేదీన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారామ్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

మద్యం షాపుల మూసివేత

జంగారెడ్డిగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం షాపులను మూసివేశారు. ఈ నెల 5న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాలు మేరకు మద్యం షాపులు, బార్‌లకు సీల్ వేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు తెలిపారు. తిరిగి 5వ తేదీ సాయంత్రం ఎలక్షన్ ముగిసిన తరువాత మద్యం షాపులు, బార్‌లు తెరుస్తారని చెప్పారు.

10న చలో విజయవాడ

జంగారెడ్డిగూడెం: సీపీఎస్ రద్దు కోరుతూ డిసెంబర్ 10న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్ నాగదుర్గారావు కోరారు. మంగళవారం తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాల, ఎంపీయుపీ ఎ.పోలవరంలో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. నాగదుర్గారావు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు 2018 జూలై నుంచి డీఏ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

దివ్యాంగుల్లో నైపుణ్యాలను మెరుగుపరచాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ రంగయ్య

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దివ్యాంగుల్లో ప్రత్యేక నైపుణ్యాలు నిబిడీకృతమై ఉంటాయని, వాటిని మరింత మెరుగుపెట్టి, వారిని ప్రోత్సహించాలని ఎంఈఓ–2 రూపావతు రంగయ్య తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక అశోక్ నగర్‌లోని అశోకవర్ధన మున్సిపల్ స్కూల్‌లో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగయ్య మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి, అందుకు తగ్గట్టుగా విద్యార్థులను తయారు చేయడంలో భవిత కేంద్రాలు దిగ్విజయంగా నడుస్తున్నట్టు చెప్పారు. భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను సాధారణ స్థితికి తీసుకు రావడానికి కృషి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. దివ్యాంగ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త భాస్కర రాజు, ఆర్ నాగేంద్ర సింగ్, హెచ్‌ఎం పార్వతి, ఉపాధ్యాయులు మల్లూరి సంతోషిణి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి షష్ఠి ఉత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పోస్టల్ కాలనీలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి షష్ఠి మహోత్సవాలు ఈనెల 4 నుంచి ప్రారంభం కానున్నాయని కార్యనిర్వహణాధికారి జి.పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9 వరకు నిత్యం హోమం, బలిహరణ, పూజలు ఉంటాయని, 7న షష్ఠి మహోత్సవం సందర్భంగా మూల మూర్తులకు అభిషేకం, సాయంత్రం శాంతి కళ్యాణం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఈ నెల 12న భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశామని తెలిపారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఇప్పటి వరకు రూ.367.63 కోట్ల విలువైన 159782.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 20,959 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఒక్క శాతానికి కేజీ చొప్పున గరిష్టంగా 5 కేజీల తరుగుతో తేమ 25 శాతం ఉన్నను కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి, రైతు కోరిన రైస్ మిల్లుకు తరలిస్తున్నామని చెప్పారు. 48 గంటల్లోపే రైతు బాంకు ఖాతాలో ధాన్యం సొమ్ము జమ చేస్తున్నట్టు తెలిపారు. రైతుల నుంచి పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



గణపవరం బాలికల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

గణపవరం: ఎమ్మెల్సీ, నీటి సంఘాల ఎన్నికలను ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు సి.నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె గణపవరంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 5న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలు, 8న నీటి సంఘాల ఎన్నికలను నిర్వహించే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల వద్ద వసతులను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ వైకేవీ అప్పారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఒక గదిని, నీటి సంఘాల ఎన్నికల కోసం ఆరు గదులను కేటాయించినట్లు కలెక్టరుకు వివరించగా ఆమె ఆ గదులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈనెల 5న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నిక ఏర్పాట్లు రేపు సాయంత్రానికే పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని, నిర్ణీత సమయం ప్రకారం పోలింగ్ ప్రారంభించి, ఎలాంటి వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో బీబీ శ్రీలక్ష్మి, ఎంఈవో గొర్రెల బాలయ్య, హెచ్‌ఎం ఎస్‌వీఎస్‌ఎస్ మూర్తి వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

హాస్టల్‌లో తనిఖీ : గణపవరంలోని బాలికల వసతి గృహాన్ని కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా వసతి గృహంలోని పరిస్థితులను ఆమె పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న టాయిలెట్స్‌ను పరిశీలించి హౌసింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వసతి గృహంలోని గదులలో శ్లాబు పెచ్చులు ఊడి ఉండటాన్ని గమనించి, తక్షణ మరమ్మతులకు ఆదేశాలు జారీ చేశారు. గదుల్లో ఫ్లోరింగ్, డైనింగ్ హాలులో మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాల,బాలుర ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. రెండు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆమె పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం బాలభాస్కరరావు, ఎంఈవో గొర్రెల బాలయ్య, అధికారులు పాల్గొన్నారు.